ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చర్యలు : సీఐ

కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ మహేందర్ రెడ్డి

కొడకండ్ల, మార్చి 25 : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్ వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఒకే బైక్‌పై వెళ్తుండడంతో వారిని అడ్డుకున్నారు. వాహనానికి ధృవీకరణ పత్రాలు లేకపోగా, వాహనదారుడికి లైసెన్స్ లేకపోవడం, మైనర్ కావడంతో వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. సీఐ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ మైనర్లకు వాహనాలను ఇచ్చినా, ప్రోత్సహించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి, సరైన పత్రాలతో, ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు.

బాణాపురం వద్ద అండర్ పాస్ ఏర్పాటు చేయాలి

జనగామ చౌరస్తా, మార్చి 25 : జనగామ పట్టణంలోని బాణాపురం వద్ద కొత్తగా నిర్మిస్తున్న హైవే బైపాస్ రోడ్డుపై అండర్ పాస్ ఏర్పాటు చేయాలంటూ కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 60 రోజులకు చేరాయి. మంగళవారం దీక్షలను రైస్‌మిల్ డ్రైవర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎండీ మునీర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాణాపురం వద్ద అండర్ పాస్ ఏర్పాటు చేయకుంటే ఈ ప్రాంత ప్రజలతో పాటు ఈ మార్గంలో ఇతర గ్రామాలకు వెళ్లే వారు రోడ్డు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా స్పందించి అక్కడ అండర్ పాస్ నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజలతో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బూడిద ప్రశాంత్, కొండ వరలక్ష్మి, మేడ నాగమణి, బిస్మిల్లా, మంజుల తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ఆశ్రమ పాఠశాలను పరిశీలిస్తున్న పింకేశ్‌కుమార్

టెన్త్ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలి

నర్మెట, మార్చి 25: పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఫలితాలు సాధించాలని అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భోజన గదితో పాటు, స్టోర్ రూం, స్టాక్ రిజిస్టర్, విద్యార్థుల హాజరు వివరాలు పరిశీలించారు. వంటశాలలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలని హెచ్ఎం కృష్ణను ఆదేశించారు. రికార్డులను సరిగా నిర్వహించాలని కోరారు. అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీటీడీవో ప్రేమకళ, తహసీల్దార్ రామనుజాచార్యు లు, ఎంపీడీవో అరవింద్ చౌదరి, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ఎన్ సిద్ధార్థరెడ్డి

ప్రభుత్వ దవాఖానలో ఉచిత కంటి వైద్య పరీక్షలు

పాలకుర్తి, మార్చి 25: మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో మంగళవారం ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉప వైద్యాధికారి సుధీర్ మాట్లాడుతూ కంటి వైద్య పరీక్షలు నిర్వహించామని తెలిపారు. వీరిలో 45 మందికి కంటి శుక్లములను పరీక్షించి సికింద్రాబాద్‌లోని పుష్పగిరి దవాఖానకు పంపించామన్నారు. మిగతా వారికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా భోజనం, మందులు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి ఎన్ సిద్ధార్థరెడ్డి, ఆకుల రాజన్నగౌడ్, రమణమ్మ, లిల్లిదేబోరా, ఇంద్రాణి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOT FOR SALE
★వరంగల్ హైవే రఘునాథ్‌పల్లికి దగ్గరలో 2 లక్షలకే 121 Sq.yds. Plots అన్ని డెవలప్‌మెంట్స్‌తో కలవు. స్పాట్ రిజిస్ట్రేషన్. ఫోన్: 8523041059.
NT-329891

TOURS & TRAVELS
★16/04/25 అయోధ్య, కాశీ, నేపాల్, ముక్తినాథ్ యాత్ర & 09/05/25 సరస్వతీ పుష్కరాలు, చార్‌ధామ్ యాత్ర. రై+బ+భో+వ. భాగ్యలక్ష్మి టూర్స్. Ph: 9397617094.
NT-1899

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

రామరాజు

కెమిస్ట్రీలో రామరాజుకు డాక్టరేట్

స్టేషన్ ఘన్‌పూర్, మార్చి 25 : కెమిస్ట్రీలో మండలంలోని తాటికొండకు చెందిన కొరివి రామరాజు డాక్టరేట్ సాధించారు. తాటికొండకు చెందిన కొరవి ఎల్లమ్మ యాదగిరి దంపతుల కుమారుడు రామరాజు రసాయన శాస్త్రంలో యాసిడ్ విజబుల్/ లైట్ మీడియేటేడ్ డీనైట్రో జినేటివ్ క్రాస్ -కప్లింగ్ అండ్ ట్రాన్సులేషన్ రియాక్షన్ ఆఫ్1, 2, 3- బెంజోట్రియాజిన్-4(3 హెచ్)-వన్స్ అనే అంశంపై పరిశోధన చేశారు. దీంతో ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతి ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించినట్లు రామరాజు తెలిపారు.

మానవ ఆక్రమ రవాణాను అరికట్టాలి

రఘునాథపల్లి మార్చి 25: మానవ ఆక్రమ రవాణా, సైబర్ ఆధారిత నేరాలను అరికట్టడంలో మహిళా సంఘాల సభ్యులు ముఖ్య భూమిక పోషించాలని అభ్యుదయ గ్రామ సంఘం వీవోఏ సరిత, జెండర్ కమిటీ సభ్యురాలు తాళ్లపల్లి కోమలత అన్నారు. మంగళవారం మండలంలోని కోమల్ల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైబర్ ఆధారిత అక్రమ రవాణా పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వీవో అధ్యక్షురాలు వెలిశాల లావణ్య పాల్గొన్నారు.

స్టేషన్ ఘన్‌పూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

కామారెడ్డిగూడెంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో బీఆర్ఎస్ నాయకులు

మత సామరస్యాన్ని ప్రతిబింబించిన ఇఫ్తార్

- స్టేషన్‌ఘన్‌పూర్, కామారెడ్డిగూడెంలో ముస్లింలకు విందు
- అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే కడియం శ్రీహరి, బీఆర్ఎస్ నాయకులు

స్టేషన్ ఘన్‌పూర్/దేవరుప్పుల, మార్చి 25 : ముస్లింల పవిత్ర పండుగ రంజాన్ సందర్భంగా మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఇఫ్తార్ విందులు కొనసాగాయి. కుల, మతాలకు అతీతంగా ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు హాజరై ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలోని ఈఆర్ఎల్ గార్డెన్‌లో నిర్వహించిన ఇఫ్తార్ విందుకు ముఖ్యఅతిథులుగా స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జిల్లా కలెక్టర్ షేక్‌రిజ్వాన్‌బాషా హాజరయ్యారు. ముస్లింలకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం మాట్లాడుతూ ఇఫ్తార్ విందు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. ముస్లింల అభ్యున్నతికి ప్ర భుత్వం సహకారం అందిస్తుందన్నారు. ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్‌ను కొందరు వ్యతిరేకిస్తున్నా ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో యువ వికాసం పథకం తీసుకొచ్చామని, దీన్ని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాంబాబు, ఆర్డీవో డీఎస్ వెంకన్న, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, వ్యవసాయ మార్కెట్ చైర్ పర్సన్ జూలుకుంట్ల లావణ్యా శిరీష్ రెడ్డి, ఏసీపీ భీంశర్మ, సీఐ వేణు, మాజీ కోఆప్షన్ సభ్యులు యాకూబ్‌పాషా, దస్తగిరి, ఆర్ఐలు సతీష్, శ్రీకాంత్, రాజేశ్‌నాయక్, ముజిబ్, విజయ్, సంపత్, వెంకట్, కొలిపాక సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

దేవరుప్పుల మండలం కామారెడ్డిగూడెం మసీదు ఆవరణలో బీఆర్ఎస్ నేతృత్వంలో ఇఫ్తార్ విందు ఇచ్చారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి చింత రవి ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న రాష్ట్రం లో తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ పాలనలో రంజాన్ పండుగ సందర్భంగా పేద ముస్లిం కుటుంబాలకు కానుకలు అందించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాలు అమలు కావడంలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మత గురువు ఇనాయత్ రసూల్, మహ్మద్ గనీమియా, గులాం రసూల్, జాకీర్, షబ్బీర్, రబ్బానీ, ఖాజా నసీరుద్దీన్, మౌలానా, యూసఫ్‌పాషా, ఇస్మాయిల్, యాకూబ్ పాషా,అజిత్, రాజ్‌మహ్మద్, రహీం, హుస్సేన్ పాల్గొన్నారు

రేషన్ డీలర్ల సంఘం జనగామ పట్టణ అధ్యక్షుడిగా ప్రశాంత్

ప్రశాంత్

జనగామ, మార్చి 25 (నమస్తే తెలంగాణ) : రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జనగామ పట్టణ నూతన కార్యవర్గం మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా రాపర్తి ప్రశాంత్, ప్రధాన కార్యదర్శిగా కే శ్రీదేవి, కోశాధికారిగా బొట్ల సుమతి, ఉపాధ్యక్షులుగా డీ స్వరూప, మంగ బాలకృష్ణ, ముఖ్య సలహాదారులుగా ఊటుకూరి మురళీధర్, చెంచారపు బుచ్చిరెడ్డి, ఎండీ ఆబాస్, గౌరవాధ్యక్షులుగా ఆకుల బాలనీల వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. నా యకులు మాట్లాడుతూ సంఘం బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు.

గోవర్ధనగిరిలో ఉపాధి హామీ పనులు పరిశీలించిన కలెక్టర్

ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న షేక్‌రిజ్వాన్‌భాషా

రఘునాథపల్లి, మార్చి 25 : ఉపాధిహామీ పథకంలో భాగంగా మండలంలోని గోవర్ధనగిరిలో జరుగుతున్న ఆర్‌సీబీ రోడ్డు పనులను జిల్లా కలెక్టర్ షేక్‌రిజ్వాన్‌బాషా మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కూలీలతో కలిసి పలుగు పట్టి మట్టిని తవ్వారు. వారి పనివేళలు, కుటుంబాల వివరాలు, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను తెలుసుకున్నారు. కొద్దిసేపు వారితో కలిసిపోయి ముచ్చటించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వేసవి దృష్ట్యా కూలీలు ఉదయం 7 నుంచి 11 వరకు పనులు ముగించుకోవాలి అన్నారు. పని ప్రదేశంలో కూలీలకు తాగునీరు, నీడ వంటి సదుపాయాలపై సంతృప్తి వ్యక్తం చేసినట్లు ఆయన తెలిపారు.వేసవిలో వడదెబ్బకు గురవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరా రు. స్వచ్ఛమైన తాగునీరు, ఓఆర్ఎస్‌ను కలుపుకుని తాగాలని, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కూలీలకు సూచించారు. అనంతరం ఓఆర్ఎస్ ప్యాకెట్లను కూలీలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో వసంత, ఎంపీడీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎకరానికి రూ.50 వేల చొప్పున పరిహారం చెల్లించాలి

సమావేశంలో మాట్లాడుతున్న చందునాయక్

జనగామ చౌరస్తా, మార్చి 25 : ప్రభుత్వ నిర్లక్ష్యంతో సాగునీరు అందక ఎండిపోయిన వరి, మక్కజొన్న పంటలకు ఎకరానికి రూ.50 వేల చొప్పున పరిహారం చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాపర్తి సోమయ్య, భూక్య చందునాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గోదావరి జలాలను దేవాదుల ప్రాజెక్ట్ ద్వారా రిజర్వాయర్లు, చెరువులు, కుంటలు నింపి పంటలు కాపాడాలని తెలిపారు. వేసవి దృష్ట్యా తాగునీటి కొరత లేకుండా చర్యలు చేపట్టాలని వారు కోరారు. జిల్లాలోని పలు ఫర్టిలైజర్ దుకాణాల్లో కల్తీ విత్తనాలు, ఎరువులు నిల్వ ఉంచి అమాయక రైతులకు విక్రయించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఏప్రిల్ 3వ తేదీన ఆర్డీవో కార్యాలయాల ఎదుట తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో చేపట్టే ధర్నాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మాచర్ల సాయన్న, మంగ బీరయ్య, రవీందర్‌రెడ్డి, రాజవ్వ, యాకయ్య, కుమారస్వామి, సమ్మయ్య, కుమార్ పాల్గొన్నారు.

27న ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు

రఘునాథపల్లి, మార్చి 25: ఎస్ఎఫ్ఐ జిల్లా నాలుగో మహాసభలు ఈనెల 27న జనగామలో నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పొదల లవకుమార్ తెలిపారు. మంగళవారం వెల్ది మోడల్ స్కూల్లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. లావకుమార్ మా ట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం దశాబ్దాలుగా పోరాడుతున్న సంఘం ఎస్ఎఫ్ఐ అన్నారు. సంక్షేమ హాస్టళ్లు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో విద్యార్థులకు మెరుగైన వసతుల కోసం నిర్వహిస్తున్న పోరాటాలను ఆయన వివరించారు. జిల్లా మహాసభలకు విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు బాసకర్ల మనిత్ రాజ్, ప్రవీణ్. వరుణ్. జంపన్న, రమేశ్ తదితరులు పాల్గొన్నా రు

సిద్ధేశ్వరుడి హుండీ ఆదాయం రూ.3.80 లక్షలు

బచ్చన్నపేట, మార్చి 25 : మండలంలోని కొడవటూరు సిద్ధేశ్వరస్వామి ఆలయంలోని హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను మంగళవారం లెక్కించారు. ఆలయ ఈవో వంశీ, ప్రత్యేకాధికారి వెంటక్‌లక్ష్మి పర్యవేక్షణలో లెక్కించగా రూ.3,80, 145 ఆదాయం సమకూరింది. ఈ కార్యక్రమంలో ఆలయ పాలక మండలి చైర్మన్ ఆముదాల మల్లారెడ్డి, ప్రధాన పూజారి ఓం నమఃశివాయ, డైరెక్టర్లు నిమ్మ కరుణాకర్‌రెడ్డి, రాములు, రాజయ్య, రామకృష్ణ, రమేశ్, శివరాములు, వెంకటయ్య, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్, తిరుపతిరెడ్డి, భిక్షపతి, అర్చకులు సదాశివుడు, మహాశివుడు, సంగమేశ్వర్, సిబ్బంది శ్రీనివాస్, లక్ష్మి కాంత్‌రెడ్డి, భానుప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రామ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

దరఖాస్తులను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో మాధురిషా

తరిగొప్పుల, మార్చి 25: ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో గ్రామ కార్యదర్శులు కీలకమని జడ్పీ సీఈవో మాధురిషా అన్నారు. మంగళవా రం స్థానిక మండల ప్రజా పరిషత్ కా ర్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశా రు. రికార్డులతోపాటు ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి మండలంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులు, మండల సభల్లో చేసిన తీర్మానాలపై జడ్పీ సీఈవోకు వివరించారు. అనంతరం మాధురీషా మా ట్లాడుతూ గ్రామల్లో కార్యదర్శులు అందుబాటులో ఉండాలని కోరారు. శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని, వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దేవేందర్, మండల పరిషత్ సూపరింటెండెంట్ ఉమా మహేశ్వర్, కార్యదర్శి భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బండనాగారంలో బాట సమస్యను పరిష్కరించిన తహసీల్దార్

రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రకాశ్‌రావు

బచ్చన్నపేట, మార్చి 25 : మండలంలోని బండనాగారంలో సుమారు వందేళ్లుగా నెలకొన్న బాట సమస్యకు మంగళవారం స్థానిక తహసీల్దార్ ప్రకాశ్‌రావు పరిష్కార మార్గం చూపారు. వివరాల్లోకి వెళ్తే.. బండనాగారంలో వందేళ్లుగా నడుస్తున్న బాటకు సిద్ధులు అనే రైతు ముళ్ల కంప వేయడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు. దీనిపై పలువురు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ ప్రకాశ్‌రావు మంగళవారం ఆర్ఐతో కలిసి వెళ్లి రైతు సిద్ధులుతో పాటు చుట్టు పక్కల రైతులతో మాట్లాడి బాటలోని ముళ్ల కంపను తొలగించారు. బాటకు అడ్డుగా కంప వేయడంతో ఏడు ముస్లిం కుటుంబాలు, పాఠశాలకు వెళ్లే విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. తహసీల్దార్ ప్రకాశ్‌రావు ప్రత్యేక చొరవకు సహకరించిన రైతు సిద్ధులుకు పలువురు కృతజ్ఞతలు తెలిపారు. సమస్య పరిష్కారమైందని హర్షం వ్యక్తం చేశారు.

జీపీ రికార్డులను పరిశీలించిన అదనపు కలెక్టర్

చిల్పూరు, మార్చి 25 : మండలంలోని మల్కాపూర్ గ్రామ పంచాయతీని మంగళవారం అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా జీపీలోని రికార్డులను పరిశీలించారు. గ్రామంలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని, స్థానిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వంద శాతం ఆస్తి, ఇంటి పన్నులను వసూలు చేయాలని ఆయన కోరారు. ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ పింకేశ్ కుమార్‌ను ఎంపీడీవో బానోత్ శంకర్ నాయక్, ఎంపీవో మధుసూదన్, పంచాయతీ కార్యదర్శి ఎస్ నవనిక ఘనంగా సత్కరించారు.

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

కలెక్టరేట్ వద్ద చలివేంద్రం ప్రారంభం

జనగామ చౌరస్తా, మార్చి 25 : చాకలి ఐలమ్మ జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ పనుల నిమిత్తం కలెక్టరేట్‌కు వచ్చే అవసరార్థులతో పాటు ప్రజలందరి దాహార్తి తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజలు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో వసంత, ఎల్డీఎం శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రైతు ఏడ్చిన రాజ్యం ఎంతో కాలం నిలవదు

- హామీలు నెరవేర్చని కాంగ్రెస్ సర్కారు కూలిపోక తప్పదు
- తెలంగాణ విద్యార్థి ఉద్యమ నాయకుడు పృథ్వీరెడ్డి

సింగరాజుపల్లిలో మాట్లాడుతున్న పృథ్వీరెడ్డి

దేవరుప్పుల, మార్చి 25: 'ఎద్దు ఏడ్చిన ఎవుసం.. రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడినట్టు చరిత్రలో లేదు..' అని, ఇదే కోవలో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ పతనం తప్పదని తెలంగాణ విద్యార్థి ఉద్యమ నాయకుడు ఇప్ప పృథ్వీరెడ్డి అన్నారు. మండలంలోని సింగరాజుపల్లిలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో తాను కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా పనిచేశానని, పాలకుర్తి ఎమ్మెల్యే గెలుపునకు కృషి చేశానన్నారు. మార్పు కోరుతూ కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే అధికారంలోకి వచ్చాక ఏ ఒక్క హామీ అమలు చేయడంలేదన్నారు. రైతులకు సంబంధించిన రూ.2 లక్షల లోపు పంట రుణాల మాఫీ, రైతుబీమా పూర్తిగా అమలు కాలేదన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో నెలకొన్న వ్యతిరేకత తొలగాలంటే రైతుభరోసాలో నిధులు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సర్కారు నిర్లక్ష్యంతో కాల్వల్లోకి నీరు రాక ఎండిన పంటలకు ఎకరాకు రూ.25 వేల చొప్పున పరిహారం ఇవ్వాలని కోరారు. లేకుంటే కాంగ్రెస్ పార్టీ కాలగర్భంలో కలిసిపోతుందని పృథ్వీరెడ్డి స్పష్టం చేశారు.

జనగామలో కోర్టు ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

హత్యకు నిరసనగా న్యాయవాదుల ఆందోళన

జనగామ చౌరస్తా, మార్చి 25 : రంగారెడ్డి జిల్లా కోర్టుకు చెందిన అడ్వకేట్ ఇజ్రాయేల్ హత్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు జనగామ బార్ అసోసియేషన్ ప్రకటించింది. మంగళవారం జిల్లా కోర్టు ఎదుట న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వై చంద్ర రుషి మాట్లాడుతూ అడ్వకేట్ ఇజ్రాయేల్‌ను హత్య చేసిన నిందితుడిని చట్టపరంగా కఠినంగా శిక్షించాలన్నారు. ఇటీవల అడ్వకేట్స్ ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం న్యాయవాదుల రక్షణ చట్టం అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నక్క సిద్ధులు, న్యాయవాదులు బాలకృష్ణ గౌడ్, మన్నె సత్తయ్య, చంద్రశేఖర్, నర్సింహులు, పసునూరి మురళి, రేణుక, జ్యోత్స్న, ఉదయ్, బాలరాజు, దాసు, రవి, బండి మధు తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్, ఆర్టీఏ అధికారుల తనిఖీలు

బచ్చన్నపేట, మార్చి 25 : మండల కేంద్రంలో మంగళవారం విజిలెన్స్, ఆర్టీఏ, మైనింగ్ అధికారుల బృందం పలు తనిఖీలు చేపట్టింది. ఈ సందర్భంగా పలు వాహనాలను సీజ్ చేశారు. ఎలాంటి పర్మిషన్లు, పత్రాలు లేని పలు వాహనాలను సీజ్ చేసినట్లు ఆధికారుల బృందం తెలిపింది. ధృవీకరణ పత్రాలు లేని బైక్‌లను పోలీస్‌స్టేషన్‌కు చేర్చినట్లు ఎస్సై హమీద్ వెల్లడించారు.

స్వయంపాలనలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

హన్మంతాపూర్ స్కూల్‌లో స్వయంపాలన

నర్మెట, మార్చి 25: మండలంలోని హన్మంతాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వయంపాలన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. డీఈవోగా దీక్షిత, హెచ్ఎంగా విధాత్రిక, ఉపాధ్యాయులుగా యశస్విని, అవంతిక, భవాని, ఈశ్వర్, ఆర్యన్ వ్యవహరించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం సామల కమల, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ ఆశ పాల్గొన్నారు.

ఆలీంపూర్ సబ్‌సెంటర్‌లో 'ఎన్‌క్వాస్'

బచ్చన్నపేట, మార్చి 25 : మండలంలోని ఆలీంపూర్ సబ్‌సెంటర్‌లో మంగళవారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఎన్‌క్వాస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మల్లికార్జున్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆరోగ్య సంరక్షణ, నాణ్యతా ప్రమాణాలు, మౌళిక వసతులు, రోగులకు ఆత్యవసర సేవలు అందించడంలో ప్రాధాన్యత ఇస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీదేవి, డాక్టర్ సృజన, ఝాన్సీ, రమ్య, సంతోష, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంతిమయాత్రలో మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య

మృతురాలి కుటుంబానికి రాజయ్య పరామర్శ

పాలకుర్తి, మార్చి 25: మండలంలోని దర్దేపల్లికి చెందిన మాజీ ఎంపీపీ దివంగత సిద్దం చిన్న రాజయ్య సతీమణి సిద్దం కౌసల్యదేవి(81) ఆనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఈ నేపథ్యంలో మృతురాలి కుటుంబాన్ని మంగళవారం స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య పరామర్శించారు. మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ బీఆ